క్లుప్తంగా

వైఎస్సార్‌ సీపీ మండల అధ్యక్షుడిగా తలారి



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన తలారి దొరబాబు, దవులూరి దొరబాబు

సామర్లకోట: వైఎస్సార్‌ సీపీ మండల పార్టీ అధ్యక్షుడిగా తలారి దొరబాబును నియమిస్తూ పార్టీ అధినేత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తర్వులు ఇచ్చారని పార్టీ నియోజకవర్గ కన్వీనర్‌ దవులూరి దొరబాబు చెప్పారు. శుక్రవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గురువారం రాత్రి తాడేపల్లిలో జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన స్వగృహంలో కలిసిన సమయంలో మండలంలో పార్టీ బలోపేతానికి యువకులకు అవకాశం ఇవ్వాలనే లక్ష్యంతో తలారిని నియమించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా తలారి దొరబాబు మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జగన్‌మోహన్‌ రెడ్డి తనపై పెట్టిన బాధ్యతకు కట్టుబడి పని చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు తలారి దొరబాబును అభినందించారు.

మరిడమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు మరిడమ్మ తల్లికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్‌ కమిషనర్‌ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వీబీఆర్‌ఐలో కార్మికుడికి పాము కాటు



చక్రధర్‌కు వైద్యం చేస్తున్న డాక్టరు రాకేష్‌

సామర్లకోట: వెటర్నరీ బయాలజీ రీసెర్చ్‌ ఇనిస్టిట్యూట్‌ (వీబీఆర్‌ఐ)లో కార్మికుడు పాముకాటుకు గురయ్యాడు. గొంచాల గ్రామానికి చెందిన ముమ్మిడి చక్రధర్‌ మరో 15 మంది తాపీ కార్మికులతో కలిసి వీబీఆర్‌ఐలో కాంక్రీట్‌ పనులు చేస్తుండగా అతడిని పాము కాటు వేసింది. తోటి కార్మికులు సమీపంలో పీహెచ్‌సీకి తరలించగా డాక్టర్‌ రాకేష్‌ అతనికి వైద్య చికిత్స చేశారు. ఈ కేంద్రంలో పేరుకుపోయిన తుప్పలను తొలగించాలని సిబ్బంది కోరుతున్నారు.

23 నుంచి పిఠాపురంలో శత చండీ మహాయాగం



యజ్ఞ పత్రికను ఆవిష్కరిస్తున్న యజ్ఞ బ్రహ్మ వడ్లమాని సుబ్రహ్మణ్య శర్మ

పిఠాపురం: శ్రీ సన్నిధి ధర్మ సేవా ట్రస్ట్‌ వారి నిర్వహణలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో పిఠాపురం గోపాల్‌ బాబా ఆశ్రమ ప్రాంగణంలో మహారుద్ర సహిత శత చండీ మహా యాగం నిర్వహించనున్నట్టు యజ్ఞ బ్రహ్మ వడ్లమాని సుబ్రహ్మణ్య శర్మ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 108 యజ్ఞ కుండలాలతో 126 మంది రుత్వికులతో శ్రీమహారుద్ర సహిత శతచండీ మహా యాగం నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహా యాగంలో దాదాపు 50 మంది సిద్ధగురువుల సమక్షంలో కనీవినీ ఎరుగని రీతిలో జరుగుతున్న ఈ మహాక్రతువులో భక్తులంతా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు. ఈ యజ్ఞంలో ప్రత్యక్షంగా పాల్గొనేవారు నిర్వాహకులను సంప్రదించాలని ఆయన సూచించారు.

వ్యక్తికి 15 రోజుల రిమాండ్‌

కిర్లంపూడి: వివాహితను లైంగిక వేధింపులకు గురి చేసిన వ్యక్తికి శుక్రవారం ప్రత్తిపాడు కోర్టు 15 రోజులు రిమాండ్‌ విధించినట్టు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్‌ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. కృష్ణవరం గ్రామానికి చెందిన 25 ఏళ్ల మహిళను అదే గ్రామానికి చెందిన రమణ పలుమార్లు లైంగిక వేధింపులకు గురిచేశాడని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కిర్లంపూడి ఎస్సై జి.సతీష్‌ కేసు నమోదు చేశారు. నిందితుడిని ప్రత్తిపాడు కోర్టుకు తరలించగా 15 రోజుల రిమాండ్‌ను విధించారన్నారు. హెడ్‌కానిస్టేబుల్‌ చక్రవేణి, సిబ్బంది ఉన్నారు.

మాకు 20.. మీకు 16..!

- పిఠాపురంలో సాగు నీటి సంఘాల పంచుకున్న టీడీపీ, జనసేన నేతలు
- రైతులతో సంబంధం లేకుండా అధ్యక్షుల ఎంపిక
- ఇదేం విడ్డూరమంటూ ముక్కున వేలేసుకుంటున్న రైతులు



ఏలేరు కాలువ

పిఠాపురం: రైతులకు సాగునీటి అవసరాలు తీర్చడానికి కాలువల ఆధునికీకరణ వంటి అభివృద్ధి పనులు నిర్వహించేందుకు నీటి సంఘాల ఎన్నికలను కూటమి నేతలు కర్షకుడితో పని లేకుండా పంచుకున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతన్నతో సంబంధం లేకుండా నిత్యం కాలువలపై తిరిగే కర్షకుడిని పట్టించుకోకుండా పిఠాపురం నియోజకవర్గంలో టీడీపీ, జనసేన నేతలు నీటి సంఘాలను పంచేసుకున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వ్యవసాయం చేయాల్సిన పని లేదు కేవలం టీడీపీ జనసేన నేతలు అయితే చాలు వారు నీటి సంఘాల అధ్యక్షులు అయిపోతారు. ఇప్పుడు పిఠాపురంలో అదే జరుగుతోంది. శనివారం నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. పిఠాపురం నియోజకవర్గంలో 36 నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. దీనికి సంబంధించి ప్రత్యేక అధికారులను నియమించారు. అర్హత కలిగిన రైతులు ఈ పోటీల్లో పాల్గొని గెలుపొందే అవకాశం ఉంది. అయితే రైతులతో సంబంధం లేకుండా పిఠాపురం టీడీపీ, జనసేన నేతలు రహస్య సమావేశం నిర్వహించుకుని నీటి సంఘాలను పంచుకున్నట్టు చెప్పుకుంటున్నారు.

నయానా భయానా రైతులను ఒప్పించి..

పిఠాపురం నియోజకవర్గంలో 36 నీటి సంఘాలకుగాను 40 శాతం టీడీపీకి 60 శాతం జనసేనకు కేటాయించుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గంలో 16 టీడీపీకి 20 జనసేనకు పంచుకున్నారు. వీటిలో పిఠాపురం మండలం, పట్టణంలో 5 టీడీపీకి, 6 జనసేనకు, కొత్తపల్లి మండలంలో 3 టీడీపీకి, 3 జనసేనకు, గొల్లప్రోలు మండలంలో 8 టీడీపీకి, 11 జనసేనకు కేటాయించుకుని పంచుకున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అయితే పలు చోట్ల టీడీపీ జనసేన నాయకుల నిర్ణయాలను స్థానిక రైతులు వ్యతిరేకిస్తున్నారు. రైతులతో సంప్రదించకుండా ఇష్టారాజ్యంగా నిర్ణయించుకోవడమేమిటంటూ నిలదీస్తున్నారు. బలం ఉన్న కొందరు రైతులు పోటీకి దిగాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. ఎవరైనా రైతులు పోటీకి దిగే ఆలోచనతో ఉంటే వారిని నయానా భయానా ఒప్పించి పోటీలోకి దిగకుండా నిలువరించాలని టీడీపీ, జనసేన నేతలు ప్రయత్నాలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే జనసేన, టీడీపీ నేతలు తమకు కేటాయించుకున్న గ్రామాల్లో తమ అనుచరులను నీటి సంఘాల అధ్యక్షులుగా ప్రకటించకోవడంతో స్థానిక రైతుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తమకు సమాచారం లేకుండా తమ ప్రమేయం లేకుండా ఎలా నీటి సంఘాల అధ్యక్షులను నిర్ణయిస్తారని పలు చోట్ల టీడీపీ జనసేన నేతలను రైతులు నిలదీస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈనేపథ్యంలో ఇరు పార్టీల నేతలు వారిని బుజ్జగించే ప్రయత్నాలు చేస్తున్నా పలు చోట్ల అవి బెడిసికొడుతున్నట్టు చెప్పుకుంటున్నారు. ఏలేరు పరివాహక ప్రాంతాల్లో అత్యంత కీలకమైన పిఠాపురం నియోజకవర్గంలో నీటి సంఘాల విభజన, విలీనాలపై అభ్యంతరాలు వ్యక్తమైనా పట్టించుకునే నాథుడు లేకుండా పోయాడు. శాస్త్రీయత లేని విభజన వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నా రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించినా జిల్లా అధికారులు పట్టించుకోకపోవడంతో వందల మంది రైతులు తమ ఓటుతో పాటు సాగునీటి సరఫరాపై హక్కులను కోల్పోయారు.

రైతాంగానికి నష్టం కలిగిస్తూ..

నియోజకవర్గంలో కొన్ని గ్రామాలను సంఘాల్లో చేర్చకపోవడం, సంబంధం లేని డీసీల్లో విలీనం చేయడం పిఠాపురం నియోజకవర్గ ఏలేరు రైతాంగానికి తీరని నష్టంగాను సమస్య గాను పరిణమించింది. డీసీల సంఖ్యను 6కు పెంచడంతో పాటు నీటి సంఘాలు 30కి పెంచడం, ఇష్టారాజ్యంగా మార్పులు చేయడంపై ఏలేరు ఆయకట్టు రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటిలో పిఠాపురం మండలం రాపర్తి, భోగాపురం, బి.ప్రత్తిపాడు, పి.దొంతమూరు, పి.రాయవరం, మల్లాం మంగితుర్తి గ్రామాలను అభ్యంతరకరంగా విభజనలు చేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న పట్టించుకోకుండా ఎన్నికలు నిర్వహించేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఒక కాలువపై సాగు చేసే గ్రామాలను రైతులను ఒక కాలువపై కాకుండా వివిధ కాలువలకు గ్రామాలకు విభజించడం ఏమిటని ప్రశ్నించినా ఎవరు పట్టించుకోడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే తమకు అనుకూలంగా ఉన్న వారిని నీటి సంఘం అధ్యక్షులుగా చేసుకుని వ్యవసాయ రంగంపై పెత్తనం చెలాయించాలని నిర్ణయించుకున్న కూటమి నేతలు తమకు వ్యతిరేకమని భావించిన వందల మంది రైతులకు ఓట్లు లేకుండా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న రాంబాబు

పిఠాపురం: స్థానిక జగ్గయ్య చెరువు కాలనీలో సమస్యలను పరిష్కరించాలని అర్బన్‌ క్రెడిట్‌ సొసైటీ మాజీ అధ్యక్షుడు బాలిపల్లి రాంబాబు కోరారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్‌ కమిషనర్‌ కనకారావుకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా రాంబాబు మాట్లాడుతూ జగ్గయ్య చెరువు ఏర్పడి 20 ఏళ్లు పైబడినా ఇప్పటి వరకూ చాలా వీధులకు రోడ్లు, డ్రైన్లు లేవన్నారు. చిన్నపాటి వర్షానికే రోడ్లు బురదమయమవుతున్నాయని గోతుల్లో నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. డ్రైన్లు లేక ఇంటి ముందే గోతులు తీసి మురికినీరు ఎత్తిపోయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 20, 21, 22 వార్డులకు కేవలం ముగ్గురే పారిశుధ్య సిబ్బంది పని చేస్తున్నారని, చెత్త ఎత్తే నాథుడే లేడని, చెత్త ట్రాక్టరు నెలకు ఒకసారి వీధిలోకి వస్తోందన్నారు. వీధి దీపాలు వెలగడం లేదని, స్తంభాలు వేసినా వాటికి లైట్లు ఏర్పాటు చేయలేదన్నారు. కాలనీ ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. తక్షణం డ్రిస్ట్రిబ్యూషన్‌ లైన్‌ వేయించాలని, వీధి దీపాలు వెలిగించి, పారిశుధ్యం మెరుగు పర్చాలని కమిషనర్‌ను కోరారు. రోడ్ల నిర్మాణంతో పాటు డ్రైన్లు ఏర్పాటు చేయాలని కోరారు. రాంబాబు వెంట బండి రవి తదితరులు ఉన్నారు.

కూటమి పాలనలో రైతుల ఇక్కట్లు

- రైతన్నకు అండగా వైఎస్సార్‌ సీపీ
- నియోజకవర్గ కోఆర్డినేటర్‌ దొరబాబు
- పాదయాత్రకు భారీగా తరలి వెళ్లిన రైతులు



దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో కాకినాడకు తరలి వెళ్లిన వైఎస్సార్‌ సీపీ శ్రేణులు

సామర్లకోట: కూటమి పాలనలో రైతులు తీవ్ర ఇక్కట్లకు గురి అవుతున్నారని వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్‌, మాజీ హౌసింగ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ దవులూరి దొరబాబు అన్నారు. ఈ మేరకు రైతులకు అండగా ఉండాలని నిర్ణయించి రైతులకు మద్దతుగా కాకినాడలో పాదయాత్ర చేసి వారి సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేశారు. సామర్లకోటలో సామర్లకోట, పెద్దాపురం రైతులతో ముత్యాలమ్మ ఆలయం వద్ద ఉండూరు, అచ్చంపేట, గొంచాల, నవర, పవర, పండ్రవాడ, పనసపాడు గ్రామాల రైతులు, వీకే రాయపురం, మాధవపట్నం తదితర ప్రాంతాల రైతులతో కలసి కాకినాడ వెళ్లారు. జగనన్న ప్రభుత్వంలో రైతులకు పెట్టుబడి సాయంగా రూ.13,500 ఇస్తే కూటమి ప్రభుత్వం ఆ పథకానికి అన్నదాత సుఖీభవ అని పేరు మార్చి ప్రతి రైతుకు రూ.20 వేలు ఇస్తామని మోసం చేశారని ఆరోపించారు. జగన్‌మోహన్‌రెడ్డి రైతులను కంటికి రెప్పగా కాపాడుకున్నారని దొరబాబు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో దళారి వ్యవస్థకు పెద్దపీట వేస్తున్నారని, ఎరువులు, పురుగు మందులు బ్లాక్‌ మార్కెట్‌కు తరలి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ వైస్‌ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్‌, నెక్కంటి సాయి ప్రసాద్‌, వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర అయ్యారక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, పార్టీ జెడ్పీ విభాగం అధ్యక్షుడు మోరంపూడి శ్రీరంగనాయకులు, జిల్లా కార్యదర్శి తలారి దొరబాబు, నాయకులు వినకొండ విష్ణుచక్రం, నల్లల గోవిందు, డాక్టరు వైఎస్సార్‌ యువసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీనివాసు, కౌన్సిలర్లు పాగా సురేష్‌కుమార్‌, సేపెని సురేష్‌, నేతల హరిబాబు, కరణం రాజ్‌కుమార్‌, మర్రి శేషారావు, మున్సిపల్‌ కోఆప్షన్‌ సభ్యుడు మన్యం చంద్రరావు, మండల పరిషత్తు కో ఆప్షన్‌ సభ్యుడు మండపాక సురేష్‌, సోషల్‌ మీడియా నియోజకవర్గ కన్వీనర్‌ వారా సుధాకర్‌, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బంగారు కృష్ణ, మాజీ సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసరావు, వైఎస్సార్‌ సీపీ సీనియర్‌ నాయకులు గంగిరెడ్డి కృష్ణమూర్తి, కరణం భాను, వేగి సత్య నారాయణ, గోకాడ రాజా, ఇరుసుమళ్ల సాయి, చిట్టుమాని శ్రీనివాసరావు, పెండ్యాల అబ్బు, ఆంధ్రమాల మహానాడు అధ్యక్షుడు లింగం శివకుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

- తహసీల్దార్‌ చంద్రశేఖరరెడ్డి



అచ్చంపేటలోని రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్‌

సామర్లకోట: రైతు సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్‌ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి అన్నారు. మండల పరిధిలో అచ్చంపేట కాపు కల్యాణ మండపంలో అచ్చంపేట, కొప్పవరం, పనసపాడు గ్రామ రైతులకు నిర్వహించిన రైతు సదస్సుకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ వీరంరెడ్డి చిన్నబాబు, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 21 దరఖాస్తులు

కొత్తపల్లి: గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్టు తహసీల్దార్‌ చిన్నారావు అన్నారు. కొమరగిరిలో శుక్రవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు 21 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదస్సులో అందిన ప్రతి దరఖాస్తు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. నేడు ఇసుకపల్లిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్‌ మురళీకృష్ణ, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్‌ దవులూరి



కార్మికుల సమ్మెకు మద్దతు తెలియజేసిన దవులూరి దొరబాబు తదితరులు

సామర్లకోట: మున్సిపల్‌ ఔట్‌ సోర్సింగ్‌ సిబ్బంది న్యాయమైన కోర్కెలు పరిష్కరించి మున్సిపాలిటీ తాగునీటి సమస్య రాకుండా చూడాలని వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్‌ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక మున్సిపల్‌ కార్యాలయం ఎదుట కార్మికులు చేస్తున్న సమ్మెకు ఆయన మద్దతు తెలియజేశారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకుని కార్మికులకు జీతాలు పెంచాల్సి ఉందన్నారు. ఐదు రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించక పోవడం దారుణమన్నారు. కార్మికులకు వైఎస్సార్‌ సీపీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ వైస్‌ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్‌, నెక్కంటి సాయిప్రసాద్‌, కౌన్సిలర్లు, ఇతర నాయకులతో పాటు, కార్మిక సంఘ అధ్యక్షుడు వి.రామరాజు, కార్యదర్శి పులపకూరి రామకృష్ణ, ఉప కార్యదర్శి కాటంరెడ్డి ఏసు తదితరులు పాల్గొన్నారు.

కుళాయిల నుంచి మురుగునీరు



- పూడికతీస్తున్న జేసీబీ వల్ల ధ్వంసమైన పైప్‌లైన్‌
- దీంతో వ్యర్థాలతో కూడిన తాగునీరు విడుదల
- సమాచారం అందుకుని పనులను పరిశీలించిన కమిషనర్‌



డ్రైనులో పూడికతీత పనులను పరిశీలించిన కమిషనర్‌ శ్రీవిద్య తదితరులు (అంతర చిత్రం) కుళాయిల నుంచి వస్తున్న మురుగునీరు

సామర్లకోట: పట్టణ పరిధిలోని అనేక ప్రాంతాలకు మున్సిపల్‌ కళాయిల నుంచి శుక్రవారం మురుగునీరు వచ్చింది. స్థానిక తెలికుల పుంతలో డ్రైన్లలో పూడికతీత పనులను పురస్కరించుకుని పూడికతీసే సమయంలో జేసీబీ వల్ల డ్రైను దిగువ భాగంలో ఉన్న తాగునీటి పైప్‌లైన్‌ ధ్వంసమైంది. దాంతో ఆ డ్రైన్‌లో ఉన్న మురుగు నీరు, నువ్వులు కడిగిన నీరు కళాయిల ద్వారా విడుదలైంది. దాంతో అనేక వార్డుల ప్రజలు ఆందోన వ్యక్తం చేశారు. దీంతో తాగునీటి కోసం ప్రజలు ప్రైవేటు ఆర్వో ప్లాంట్ల వద్దకు పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్‌ కమిషనర్‌ ఎ.శ్రీవిద్య పూడిక తీత పనులను పరిశీలించారు. నువ్వులు శుభ్రం చేసుకునే వారికి నోటీసు ఇవ్వాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను కమిషనర్‌ ఆదేశించారు. పూడికతీత పనుల వద్ద సచివాలయాల్లోని ఇంజినీరింగ్‌ అసిస్టెంట్లు ఉండేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ రాజశేఖర్‌, కౌన్సిలర్‌ బలుసు వాసు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బాస్కెట్‌బాల్‌ జట్టుకు శ్రావణి



జాతీయ జట్టుకి ఎంపికయిన శ్రావణి

పిఠాపురం: విజయవాడలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న పిఠాపురానికి చెందిన కేఎస్‌వీఎస్‌ శ్రావణి జాతీయ జట్టుకి ఎంపిక అయినట్టు పిఠాపురం బాస్కెట్‌బాల్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు డాక్టర్‌ మొగలి కాశీ విశ్వనాథం జిల్లా కార్యదర్శి బొజ్జ మాణిక్యాలరావు తెలిపారు. ఈనెల 18వ తేదీ నుంచి 24 వరకూ కేరళలో జరగనున్న సౌత్‌ జోన్‌ ఇంటర్‌ యూనివర్సిటీ బాస్కెట్‌బాల్‌ మహిళా చాంపియన్‌షిప్‌లో పాల్గొనే కృష్ణ యూనివర్సిటీ జట్టుకు ఎంపికైనట్టు వారు తెలిపారు. ఆమె గతంలో పిఠాపురం నుంచి ఐదు సార్లు జాతీయ జట్టుకు ఎంపికైనట్టు వారు తెలిపారు. ఆమెను పిఠాపురం బాస్కెట్‌బాల్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు డాకర్‌ మొగలి కాశీ విశ్వనాథం, జిల్లా కార్యదర్శి బొజ్జ మాణిక్యాలరావు, జిల్లా సభ్యులు కొత్యం సుందర కుమార్‌ ,నంబూరు అర్జున, గరికపాటి దుర్గాప్రసాద్‌ బొజ్జసతీష్‌ తదితరులు అభినందించారు.

సైబర్‌ నేరాలపై అవగాహన

గండేపల్లి: నీలాద్రిరావుపేటలోని శ్రీకిరణ్‌ ప్రైవేటు స్కూల్లో శుక్రవారం విద్యార్థులకు సైబర్‌ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ వైఆర్కే శ్రీనివాస్‌ మాట్లాడుతూ విద్యార్థులంతా స్నేహపూరిత వాతావరణంలో విద్యనభ్యసించాలని, సెల్‌ ఫోన్లో వచ్చే అపరిచిత మెసెజీలను ఓపెన్‌ చేయకూడదని చెప్పారు. రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని తెలియజేస్తు సైబర్‌ క్రైమ్‌ నేరాలు, మోసాలు, మహిళా రక్షక్‌ అవేర్నెస్‌, బ్యాగ్‌ లిఫ్టింగ్‌ దొంగతనాల నివారణ, మత్తు పదార్థాలు, పానీయాల జోలికి పోకూడదని ప్రొజెక్టర్‌ ద్వారా వివరించారు.

దుర్గాడలో విజిలెన్స్‌ దాడులు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

పిఠాపురం: విజిలెన్స్‌ ఎస్పీ స్నేహిత ఆదేశాల మేరకు గొల్లప్రోలు మండలం దుర్గాడలో విజిలెన్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంటు, తూనికలు కొలతలు శాఖ ఆధ్వర్యంలో పురుగు మందుల దుకాణాలపై శుక్రవారం దాడులు నిర్వహించారు. విజిలెన్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంటు సీఐ నాగ వెంకట్‌ రాజు, ఏజీ లక్ష్మీనారాయణ, ఏఈ సుబ్రహ్మణ్యం, పీసీ వీర బాబు, తూనికలు కొలతలు శాఖ ఇన్‌స్పెక్టర్‌ సరోజినీ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము నిర్వహించిన దాడుల్లో దుర్గాడ వెంకటేశ్వర ఏజెన్సీస్‌లో గత నాలుగు రోజుల నుంచి చేసిన ఎరువులు అమ్మకాల్లో బుక్‌ బ్యాలెన్స్‌ గ్రౌండ్‌, తేడాలు గుర్తించామన్నారు. షాపులో రూ.1,41,050 విలువ గల 4.400 మెట్రిక్‌ టన్నులు ఎరువులపై 6ఏ కేసు నమోదు చేశామన్నారు. మరో దుకాణం గంగా ట్రేడర్స్‌లో 9.250 లీటర్లు వివిధ రకాల మందులను సీజ్‌ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.వి.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక హనుమద్వ్రతాలు

సామర్లకోట: స్థానిక మారుతినగర్‌లోని 65 అడుగుల ప్రసన్నాంజనేయుని ఆలయం లో శుక్రవారం సామూహిక హనుమద్వ్రతాలు నిర్వహించారు. ఆలయంలో పతంజలిశాస్త్రి ఆధ్వర్యంలో హనుమజ్జయంతి సందర్భంగా ఈ వ్రతాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలోని స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సుందర కాండ పారాయణ చేశారు. సాయంత్రం స్వామివారికి లక్ష నాగవల్లీ పత్రి పూజ, ఆంజనేయ హోమం, నీరాజన మంత్ర పుష్పాలు, దర్బారు సేవ జరిగాయి. రాత్రి పెద్ద ఆంజనేయ స్వామి వారికి పుష్పాలు, తమల పాకులతో అభిషేకాలు నిర్వహించారు. స్థానిక స్టేషన్‌ సెంటర్‌లోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో, కోట్లమ్మ చెరువు వద్ద ఉన్న వీరాంజనేయ ఆలయం, రాజీవ్‌గృహకల్ప వద్ద ఉన్న ఆంజనేయ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

ప్రసన్నాంజనేయునికి విశేష పూజలు

స్థానిక మారుతినగర్‌లో ఉన్న 65 అడుగుల ఎత్తైన ప్రసన్నాంజనేయునికి శుక్రవారం రాత్రి లక్ష పుష్పాలు, లక్ష తమలపాకులతో అభిషేకం చేశారు. తొమ్మిది మంది వేద పండితుల ఆధ్వర్యంలో చేసిన పూజలలో స్వామివారి నుంచి పడిన పుష్పాలు, తమలపాకుల కోసం ఎగపడ్డారు.

పెద్దాపురంలో..

పెద్దాపురం: పెద్దాపురం అర్బన్‌, రూరల్‌ ప్రాంతాల్లో హనుమంతుని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక మెయిన్‌రోడ్డు ప్రసన్నాంజనేయ స్వామి, మండలంలోని చదలాడ గ్రామంలోని ఆంజనేయుని ఆలయాల వద్ద అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని హనుమద్వ్రతాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో సామూహికంగా హనుద్వ్రతం చేస్తున్న భక్తులు



చదలాడ ప్రసన్నాంజనేయ స్వామి గుడివద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు



సామర్లకోటలోని ప్రసన్నాంజనేయ స్వామి వారికి పుష్పాలు, తమలపాకులతో అభిషేకాలు

శ్రీనివాసరావుకు గద్దర్‌ పురస్కారం



గద్దర్‌ జాతీయ పురస్కారం అందుకున్న పోలాబత్తిన శ్రీనివాసరావు

సామర్లకోట: అచ్చంపేటకు చెందిన కాకినాడ జిల్లా హ్యూమన్‌ రైట్స్‌ ఫౌండేషన్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ పోలాబత్తిన శ్రీనివాసరావుకు స్వర్గీయ గద్దర్‌ జాతీయ పురస్కారం లభించింది. ఈ మేరకు శుక్రవారం శ్రీనివాసరావు స్థానిక విలేకర్లకు తెలిపారు. మానవహక్కుల దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్‌ కోనసీమ జిల్లా గన్నవరంలో మమతా స్వచ్ఛంద సేవా సమితి వ్యవస్థాపకులు కొరుకొండ జాన్‌ ఆధ్వర్యంలో హ్యూమన్‌ రైట్స్‌ ద్వారా ప్రజలకు చేస్తున్న సేవలను గుర్తించి ఈ పురస్కారం అందించారన్నారు.